
# నమస్తే తెలంగాణ
# నాగర్‌కర్నూల్
5 | మహబూబ్‌నగర్, శనివారం 23 డిసెంబర్ 2023 | NAGARKURNOOL

జడ్చర్ల వెంకన్న ఆలయంలో ఏర్పాటు చేసిన బారికేడ్లు

## జడ్చర్లలో సర్వం సిద్ధం

జడ్చర్ల, డిసెంబర్ 22 : ముక్కోటి ఏకాదశిని పురస్కరించుకుని జడ్చర్ల మండలంలో వైష్ణవ ఆలయాలు ముస్తాబయ్యాయి. శనివారం తెల్లవారు జామున నుంచే ఉత్తర ద్వారం మీదుగా దర్శించుకునేలా సర్వం సిద్ధం చేశారు. గంగాపూర్‌లోని లక్ష్మీచెన్నకేశస్వామి ఆలయంలో తెల్లవారుజామున 5 నుంచి రాత్రి 7:30 గంటల వరకు భక్తులకు దర్శనభాగ్యం కల్పించనున్నారు. అలాగే జడ్చర్లలోని లక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయాన్నీ సుందరంగా అలంకరించారు. వేకువ జామున 3 గంటలకు వెంకన్న పల్లకీ మహోత్సవం అనంతరం 4 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు దర్శనాలు కల్పించనున్నారు. ఉత్తర ద్వారాలను అలంకరించారు. భక్తులు వేలాదిగా తరలిరానున్న నేపథ్యంలో ఆలయ నిర్వాహకులు బారికేడ్లను ఏర్పాటు చేశారు. వివిధ పూలతో ఆలయాలను అందంగా అలంకరించారు.

## వైకుంఠ శోభ

పాలమూరు, డిసెంబర్ 22 : శనివారం వైకుంఠ ఏకాదశిపర్వ దినాన్ని భక్తులు వైభవంగానిర్వ హించేందుకుసి ద్ధమయ్యారు. వైష్ణవాలయాలు ముస్తాబు కాగా ఉత్తర ద్వారం మీదుగా వెంకన్న స్వామినిదర్శించు కోనున్నారు. ఇందుకోసంమ న్యంకొండ, పిల్లలమర్రివేం కటేశ్వరస్వామి, జిల్లాలోని వివిధ ఆలయాలు ముస్తాబయ్యాయి. ప్రజలు ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. భక్తుల సౌకర్యార్థం ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.



## మహిమాన్వితం..
# ఆదిశిలా క్షేత్రం

- నేటి నుంచి మల్దకల్‌లో బ్రహ్మోత్సవాలు
- స్వయంభూ లక్ష్మీవేంకటేశ్వర స్వామిగా గుర్తింపు

మల్దకల్, డిసెంబర్ 22 : తెలంగాణలోని ప్రసిద్ధ పుణ్య క్షేత్రాల్లో మల్దకల్‌లోని ఆదిశిలా క్షేత్రానికి ఎంతో ప్రాధాన్యత ఉన్నది. ఇక్కడ వెలిసిన స్వయంభూ లక్ష్మీవేంకటేశ్వరస్వామి మల్దకల్ తిమ్మప్పగా పేరు గాంచారు. ఈ ప్రాంతంలో రుద్రుడు (శివుడు) తపస్సు చేసినందువల్ల వేంకటేశ్వర స్వామి వెలిసినట్లు పురాణాలు చెబుతున్నాయి. అందుకే ఈ ప్రాంతాన్ని రుద్రభూమిగా పిలుస్తారు. అందరూ తిరుపతి కొండకు వెళ్లి తమ మొక్కులు తీర్చుకుంటే మల్దకల్, పెద్దొడ్డి గ్రామాల ప్రజలు మాత్రం తిమ్మప్పను తిరుపతి దేవునితో సమానంగా కొలుస్తారు.

**ప్రతియేటా మార్గశిరమా సంలో..**

ప్రతి సంవత్సరం మార్గశిర మాసంలో స్వామి వారి బ్రహ్మోత్సవాలు కనుల పండువగా నిర్వహిస్తారు. ఉత్సవాల్లో భాగంగా 23న బోడిప్రభ రాత్రి హనుమత్ వాహనంపై ఊరేగింపు, 24న రాత్రి 11గంటలకు స్వామివారి కల్యాణోత్సవం, గరుఢ ప్రభోత్సవంపై ఊరేగింపు, 25న తెప్పోత్సవం, శేషవాహనంపై ఊరేగింపు, 26న రాత్రి 12 గంటలకు స్వామివారి రథోత్సవం కార్యక్రమాలు నిర్వహిస్తారు. అయితే ఉత్సవాలకు తెలంగాణ జిల్లాలలోపాటు ఆంధ్రప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాల నుంచి భక్తులు పెద్దసంఖ్యలో తరలివస్తుండడంతో ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేశారు. శుక్రవారం బ్రహ్మోత్సవాలకు ధ్వజారోహణంతో అంకురార్పణ చేశారు. ఈ సందర్భంగా వేదపండితులు ప్రసన్నాచారి, శ్రీధర్, శశంకాదాస్, మధుసూదనాచారి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.



మల్దకల్‌లోని లక్ష్మీ వేంకటేశ్వర స్వామి ఆలయం

- విష్ణుమూర్తికి ప్రీతి ప్రదమైన పండుగ
- ఉత్తర ద్వార దర్శనానికి ప్రత్యేక ఏర్పాట్లు
- ఈ ఏడాది రెండుసార్లు రావడం విశేషం
- ఉమ్మడి జిల్లాలో శోభాయమానంగా వైష్ణవాలయాలు

ముక్కోటి దేవతలు శ్రీమన్నారాయణుడిని కళ్లారా దర్శించుకునే రోజు వైకుంఠ ఏకాదశి. అటువంటి పవిత్రమైన ఏకాదశి ఈ ఏడాది జనవరి 2న రాగా.. మళ్లీ శనివారంతో రెండు సార్లు రావడం విశేషం. విష్ణుమూర్తికి ప్రీతిప్రదమైన ఈ పండుగ రోజు ఆలయాల్లోని ఉత్తర ద్వారం నుంచి స్వామిని భక్తులు దర్శించుకుంటారు. సకల పాప నివారిణి ముక్కోటి ఉత్సవాలకు ఉమ్మడి జిల్లాలోని వైష్ణవాలయాలు ముస్తాబయ్యాయి. రంగులు వేసి విద్యుద్దీపాలతో అందంగా అలంకరించారు. తెల్లవారుజాము నుంచే భక్తులకు దర్శనభాగ్యం కల్పించేలా నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు.

– గద్వాల టౌన్/అయిజ, డిసెంబర్ 22



విద్యుద్దీప కాంతులతో వైకుంఠ ఏకాదశికి ముస్తాబైన మహబూబ్‌నగర్‌లోని వేంకటేశ్వరస్వామి ఆలయం

నేడు వైకుంఠ ఏకాదశి

### ఉత్తనూరు వెంకన్న ఆలయం ముస్తాబు

జోగుళాంబ గద్వాల జిల్లా అయిజ మండలం ఉత్తనూరులో జనమే జయ మహారాజు మునిమనవడు అర్జునుడుచే ప్రతిష్ఠించిన ధన్వంతరి వేంకటేశ్వరస్వామి ఆలయంలో వైకుంఠ ఏకాదశికి ఏర్పాట్లు చేశారు. శనివారం వేకువ జామున 4:30 గంటలకు దివ్యమైన ముహూర్తంలో ఉత్తర ద్వార బంధనాన్ని వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య తెరిచి ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. మధ్యాహ్నం 12 గంటలకు శ్రీదేవి, భూదేవి సమేత వెంకన్న కల్యాణం నిర్వహించనున్నారు. భక్తులు భారీగా తరలిరానున్నారు.




## సకల పాప నివారిణి
# ముక్కోటి

హిందూ క్యాలెండర్ ప్రకారం ప్రతి ఏటా సూర్యుడు దక్షిణయాణం నుంచి ఉత్తరాయణంలోకి ప్రవేశించడానికి ముందు వచ్చే ఏకాదశినే వైకుంఠ ఏకాదశి లేదా ముక్కోటి ఏకాదశి అంటారు. ఈ పండుగ వైష్ణవ భక్తులకు పరమ పవిత్రమైనది. తిరుమలలో సహా అన్ని వైష్ణవాలయాల్లో ఉత్తరం వైపు ఉండే ద్వారాన్ని తెరుస్తారు. ఈ రోజు ఉత్తర ద్వారం మీదుగా స్వామిని దర్శించుకుంటే సకల పాప నివారిణితోపాటు వైకుంఠ ప్రవేశం చేసినంత పుణ్యం కలుగుతుందని పురాణాలు చెబుతున్నాయి. అలాగే ఏకాదశి వ్రతాన్ని కూడా ఆచరించడంతో శ్రీమన్నారాయణుడిని దర్శించుకునే భాగ్యం కలుగుతుందని భక్తుల నమ్మకం. అందుకు వైకుంఠ ఏకాదశి రోజు భక్తులు అత్యంత భక్తి శ్రద్ధలతో ఏకాదశి వ్రతాన్ని నిర్వహిస్తారు.

**పురాణ ప్రాశస్తి**

కృత యుగంలో చంద్రావతి నగరాన్ని రాజధానిగా చేసుకుని మురాసురుడనే రాక్షసుడు పాలించే వాడు. బ్రహ్మదేవుని వరంతో మురాసురుడు మహర్షుల యజ్ఞాలను ధ్వంసం చేయడంతోపాటు దేవతలను సైతం వేధించేవాడు. దీంతో వారంతా కలసి విష్ణువుతో మొరపెట్టుకోగా.. మహావిష్ణువు మురాసురుడిపై యుద్ధానికి బయలు దేరాడు. కానీ మురాసురుని సంహరించడం విష్ణువు వల్ల సాధ్యం కాకపోవడంతో అలసిపోయిన హరి బదరికా ఆశ్రమంలో విశ్రాంతి తీసుకునేందుకు ఉపశమించాడు. ఆ సమయంలో స్వామి శరీరంలో నుంచి ఏకాదశి కన్య ఉద్భవించింది. ఆ కన్య మురాసురునితో యుద్ధం చేసి వధించింది. కన్య ధైర్యాన్ని మెచ్చుకున్న స్వామి ఏ వరం కావాలో కోరుకోమన్నాడు. దీంతో కన్య తన పేరుమీద ఎవరైతే భక్తి శ్రద్ధలతో ఏకాదశి వ్రతం ఆచరించి శ్రీమన్నారాయణుడిని కొలుస్తారో వారికి మోక్షం కలిగించి వైకుంఠ ప్రాప్తి కలిగించమని కోరుకుంటుంది. అందుకే భక్తులు ఏకాదశి రోజు ఉపవాసంతో, భక్తి శ్రద్ధలతో స్వామి వ్రతాన్ని ఆచరిస్తారు.

**వైకుంఠ ఏకాదశి విశిష్టత**

చైత్ర మాసం మొదలుకుని ఫాల్గుణ మాసం వరకు ఏటా 24 ఏకాదశిలు వస్తుంటాయి. అందులో సూర్యగమనం ప్రకారం ధనుర్మాసంలో శుక్లపక్ష ఏకాదశిని వైకుంఠ ఏకాదశి అని, ముక్కోటి ఏకాదశి అని, పుత్రత ఏకాదశి అని పిలుస్తారు. శ్రీహరికి ఇష్టమైన ప్రదేశం వైకుంఠం. ఇష్టమైన తిథి ఏకాదశి అలాంటి ఏకాదశుల్లో అత్యంత ప్రాధాన్యమున్నదే వైకుంఠ ఏకాదశి. సర్వ ధామం, ముక్కోటి ఏకాదశి అని పిలిచే ఈ ఏకాదశిని వైష్ణవాలయాలలో అత్యంత వైభవంగా నిర్వహిస్తారు.

**ఉత్తర ద్వార దర్శనం.. మోక్షదాయకం..**

మహావిష్ణువుకు ప్రీతికరమైన ముక్కోటి ఏకాదశి రోజు ఉత్తర ద్వారం మీదుగా విష్ణువును దర్శించుకోవడం మోక్షదాయకమని పురాణాలు చెబుతున్నాయి. ఈ రోజున వైకుంఠ సప్తద్వారాలు తెరుచుకుని ఉంటాయని, వైష్ణవాలయాలలో ఉత్తర ద్వారాన్నే వైకుంఠ ద్వారంగా భావించి వేకువజాము నుంచే భగవత్ దర్శనార్థం భక్తులు నిరీక్షిస్తారు. ఇదే రోజున మహావిష్ణువు గరుఢ వాహనదారుడై ముక్కోటి దేవతలతో కలిసి భూమికి దిగి వచ్చి దర్శనమిస్తాడని భక్తుల విశ్వాసం. అందుకే సూర్యోదయానికి ముందే స్నాన, సంధ్యాదులు పూర్తి చేసుకుని దేవాలయానికి వెళ్లి ఉత్తర ద్వారం మీదుగా స్వామిని దర్శించుకుంటే ఆ పరమాత్మ అనుగ్రహం సంపూర్ణంగా లభిస్తుందని, ముక్కోటి దేవతలు ఆశీర్వదిస్తారని భక్తుల నమ్మకం. ధనుర్మాసంలో స్వామివారిని ఉత్తర ద్వార ముఖంగా చూడాలని కూడా పెద్దలు చెబతారు.

**గద్వాలలో ఏర్పాట్లు**

వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకుని శనివారం ఉత్తర ద్వార దర్శనం కోసం గద్వాల జిల్లా కేంద్రంలోని కోటలోని శ్రీ భూలక్ష్మీ చెన్నకేశవస్వామి, బుర్ధాపేటలోని గోదారంగనాథ స్వామి, పెద్ద అగ్రహారంలోని శ్రీలక్ష్మీనృసింహ, గంజిపేటలోని శ్రీ వేంకటేశ్వరస్వామి, నదీ అగ్రహారంలోని శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయాలతోపాటు జిల్లాలోని బీచుపల్లి, అలంపూర్, ధరూర్, మల్దకల్, అయిజ మండలాల్లో ఉన్న వైష్ణవాలయాల్లో ఏర్పాట్లు పూర్తి చేశారు. ఉదయం 4 గంటల నుంచే విశేష అభిషేక పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నారు. 5 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు ఉత్తర ద్వార ప్రవేశం ఉంటుంది. అలాగే తిరుప్పావై పారాయణం, పొంగళి నివేదన, ఆర్తి, గోష్ఠితోపాలు వివిధ పూజా కార్యక్రమాలను నిర్వహించనున్నారు. భక్తులు తరలిరానున్నారు.

## సంప్రదాయబద్ధంగా
# అనాథ యువతులకు వివాహం

- నూతన జంటలను ఆశీర్వదించిన నాగర్ కర్నూల్‌కలెక్టర్ దంపతులు
- అనాథ ఆశ్రమ నిర్వాహకులకు పలువురి అభినందన

నాగర్‌కర్నూల్, డిసెంబర్ 22: అనాథ బాలికలను చేరదీసి వారికి విద్యాబుద్ధులు నేర్పించి పెళ్లీడుకు వచ్చాక ఇద్దరు యువతులకు వైభవంగా వివాహాలు జరిపించి అత్తారింటికి పంపించారు అనాథ ఆశ్రమ నిర్వాహకులు. నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రం సమీపంలోని కొల్లాపూర్ చౌరస్తా దగ్గర నెలకొల్పిన శ్రీజ్ఞానేశ్వర వాత్సల్య మందిరం(అరక్షిత అనాథ)లో అనాథలుగా చేరిన దీపిక, మల్లేశ్వరీలు పెళ్లీడుకు రావడంతో నిర్వాహకులు కుదిర్చిన దీపిక–సతీశ్‌రెడ్డి, మల్లేశ్వరి–కిరణ్‌కుమార్‌రెడ్డి పెండ్లివేడుక వేదమంత్రోచ్చారణల మధ్య సంప్రదాయబద్ధంగా జరిపించారు. ఈ వివాహవేడుకకు నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ ఉదయ్‌కుమార్ దంపతులు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. అదేవిధంగా నాగర్‌కర్నూల్ మున్సిపల్ చైర్‌పర్సన్ కల్పనాభాస్కర్‌గౌడ్, ప్రముఖులు, అధికారులు శ్రేయోభిలాషులు ఆశ్రమ దాతలు, కుటుంబ సభ్యులు వివిధ ప్రాంతాల నుంచి వందలాలదిగా తరలివచ్చి నూతన దంపతులను ఆశీర్వదించడమే కాకుండా అనాథ ఆశ్రమ నిర్వాహకులను అభినందించారు. కార్యక్రమంలో అరక్షిత బాలుర ఆశ్రమ నిర్వాహకుడు దొడ్ల నారాయణరెడ్డి, ఆలయ కార్యదర్శి ఎలిమే ఈశ్వరయ్య, పొలిశెట్టి లక్ష్మీశేఖర్, వరలక్ష్మి, దొడ్ల ఇందుమతి, వరలక్ష్మి, శ్యాంసుందర్, వీహెచ్‌పీ సభ్యులు, సత్యసాయి సేవా సమితి సభ్యులు, జ్ఞాన వికాస భారతి సభ్యులు, జ్ఞానేశ్వర్ వాత్సల్య మందిర్ కమిటీ సభ్యులు, దాతలు పాల్గొన్నారు.



వధూవరులనుఆ శీర్వదిస్తున్నకలె క్టర్‌ద ంపతులు

# వామ్మో.. చిరుతలు..!

- మల్కిమియాన్‌పల్లి, యన్మన్‌గండ్లలో చిరుతల సంచారం
- భయాందోళనలో రైతులు, ప్రజలు
- ఘటనా స్థలాన్ని పరిశీలించిన అటవీశాఖ అధికారులు



చిరుత పాదముద్ర

చిరుతలఆ నవాళ్లుప రిశీలిస్తున్న ఫారెస్ట్‌అధి కారులు,గ్రామస్తులు

ఖిల్లాఘణపురం, డిసెంబర్ 22 : మండలంలో రెండు చిరుత పులుల సంచారంతో ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారు. వివరాల్లోకి వెళితే మండలంలోని మల్కిమియాన్‌పల్లి గ్రామానికి సమీపంలో ఉన్న బోడగట్టుకు 50మీటర్ల దూరంలో రైతు గూడురు శ్రీనివాస్‌రెడ్డి తన షెడ్డులో పాడి పశువులను పెంచుతున్నాడు. శుక్రవారం తెల్లవారుజామున 5గంటలకు రోజు మాదిరిగానే పాలు పితకడానికి షెడ్డు వద్దకు వెళ్లగా అక్కడే ఉన్న కుక్కలు అరవడం మొదలు పెట్టాయి. కుక్కలు గుంపుగా గుట్టవైపు అరుస్తు పరుగెత్తాయి. చిరుత పులుల గాండ్రింపులకు భయపడిన కుక్కలు వెనక్కి రావడంతో శ్రీనివాస్‌రెడ్డి టార్చ్ లైట్ వేయగా రెండు చిరుత పులులు గుట్ట పక్కనే ఉండడం గుర్తించాడు. వెంటనే గ్రామస్తులకు తెలుపడంతో గ్రామస్తులు అక్కడికి చేరుకొని చూడగా రెండు చిరుతపులులు గ్రామస్తులు చూడగానే బోడగట్టుపైకి వెళ్లాయి. వారు వెంటనే అటవీ అధికారులకు సమాచారం ఇవ్వడంతో అక్కడికి చేరుకున్న అటవీ అధికారులు గ్రామస్తులతో కలిసి చుట్టు కేకలు వేస్తు పరిసరాలను పరిశీలించారు. గ్రామానికి ఆనుకొని ఉన్న బోడగట్టుపైకి వెళ్లి చూశారు. అక్కడక్కడ చిరుత పులుల పాదముద్రలు కనిపించడంతో వాటిని ఫారెస్ట్ అధికారులు పరిశీలించారు. పశువుల కాపరులు ఒక్కరొక్కరుగా పశువులను మేపేందుకు వెళ్లకూడదని, అటవీ ప్రాంతానికి వెళితే ఇద్దరు లేదా ముగ్గురు వెళ్లడం మంచిదని అధికారులు సూచించారు. చిరుత పులుల సంచారం ఉంటే వెంటనే పైఅధికారులకు సమాచారం అందించి వాటిని పట్టుకునేందుకు బోన్లను ఏర్పాటు చేస్తామని చెప్పారు. ఘటనా స్థలాన్ని పరిశీలించిన వారిలో ఫారెస్ట్ అధికారులు భాస్కరాచారి, ఆంజనేయులు తదితరులు ఉన్నారు.

**మూగజీవాలపై చిరుత దాడి**

నవాబ్‌పేట, డిసెంబర్ 22 : మండలంలోని యన్మన్‌గండ్ల గ్రామ శివారులో ప్రాంతాల్లో చిరుత గురువారం రాత్రి మూగజీవాలపై దాడి చేసింది. అటవీ ప్రాంతాన్ని వదిలి చిరుత జనావాసాల్లోకి రావడంతో చుట్టు పక్కల గ్రామాల రైతులు, ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. స్థానిక రైతుల సమాచారం ప్రకారం.. యన్మన్‌గండ్ల గ్రామ శివారులోని వ్యవసాయ పొలాల్లో రాత్రి చిరుత సంచరించి అదే గ్రామానికి చెందిన పాశం రమేశ్‌కు చెందిన పశువుల పాక వద్దకు వెళ్లి గేదే దూడపై దాడి చేసి తీవ్రంగా గాయపర్చింది. అలాగే పక్కనే గల బ్యాగరి శ్రీనివాసులు పశువుల కొట్టం వద్దకు వెళ్లి అందులో ఉన్న రెండు లేగదూడలపై దాడి చేసి తీవ్రంగా గాయపర్చింది. కొంత దూరంలో ఉన్న రుద్రారం గ్రామానికి చెందిన బాల్ చెన్నయ్య పశువుల కొట్టంపై దాడి చేసి లేగదూడను గాయపర్చింది. ఉదయం పశువుల పాకకు వెళ్లి దాడికి గురైన దూడలను చూసి రైతులు ఒక్క సారిగా అవాక్కయ్యారు. రాత్రి వేళల్లో అదే ప్రాంతంలో రైతులు వ్యవసాయ పొలాల్లో సంచరిస్తూ ఉంటారు. ఒక వేళ చిరుత కంట పడితే తమ పరిస్థితి ఏంటని భయాందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా అటవీ అధికారులు స్పందించి చిరుత దాడులనుంచి తమను, పశువులను కాపాడాలని రైతులు కోరుతున్నారు.

## గేదెను తప్పించబోయి..

- జాతీయ రహదారిపై ఏపీకి చెందిన ఆర్టీసీ బస్సు బోల్తా
- 21మంది ప్రయాణికులకు తప్పిన ప్రమాదం



బోల్తాపడిన ఆర్టీసీ బస్సు

కొత్తకోట, డిసెంబర్ 22 : గేదెను తప్పించబోయి ఆర్టీసీ బస్సు బోల్తా పడిన ఘటన వనపర్తి జిల్లా కొత్తకోట మండలంలోని కనిమెట్ట వద్ద 44వ జాతీయ రహదారిపై చోటు చేసుకున్నది. ఎస్సై మంజునాథ్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కర్నూల్ జిల్లా ఆళ్లగడ్డ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు గురువారం రాత్రి 21 మంది ప్రయాణికులతో ఆళ్లగడ్డ నుంచి హైదరాబాద్ బయలుదేరింది. తెల్లవారు జామున కనిమెట్ట సమీపంలోకి రాగానే బస్సుకు గేదె అడ్డుగా రావడంతో బస్సు డ్రైవర్ గురుదేవ్ గేదెను తప్పించబోగా బస్సు అదుపుతప్పి రోడ్డు కిందకు దూసుకెళ్లి బోల్తా పడింది. బస్సు వేగం తక్కువగా ఉండడంతో ప్రయాణికులంతా సురక్షితంగా బయట పడడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెల్లడించారు.

## జడ్చర్లలో భారీ చోరీ

- 14తులాలు బంగారు, రూ.1.50లక్షలు నగదు అపహరణ

జడ్చర్లటౌన్, డిసెంబర్ 22 : జడ్చర్ల మున్సిపాలిటీ పరిధిలోని రంగారావుతోట ప్రాంతంలో ఓ వ్యాపారి ఇంట్లో భారీ చోరీ జరిగింది. ఇంటి తాళాన్ని విరగొట్టిన దొంగలు బీరువాలో దాచిన 14తులాల బంగారు ఆభరణాలతోపాటు రూ.1.50 లక్షలు నగదును ఎత్తుకెళ్లారు. పోలీసుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణంలోని రంగారావుతోట ప్రాంతంలో నివాసముంటున్న విభూషణ్‌రెడ్డి అనే వ్యాపారి గురువారం మొదటి అంతస్థులోని తన ఇంటికి తాళం వేసి కుటుంబసభ్యులతో కలిసి హైదరాబాద్‌లో శుభాకార్యానికి వెళ్లారు. తిరిగి అర్ధరాత్రి దాటిన తర్వాత రెండున్నర గంటల ప్రాంతంలో ఇంటికి చేరుకొని పరిశీలించగా, ఇంటికి వేసిన తాళం తిరగబడి ఉండడాన్ని గుర్తించారు. ఇంట్లోని బీరువా తలుపులు తెరచుకొని సామాన్లు చిందరవందరగా పడి ఉండటంతో దొంగతనం జరిగినట్లు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చాడు. బీరువాలో దాచుకున్న 14 తులాల బంగారు అభరణాలు, రూ.1.50 లక్షలు నగదును దొంగలు ఎత్తుకెళ్లారని బాధితుడు తెలిపారు. శుక్రవారం ఉదయం జడ్చర్ల సీఐ రమేశ్‌బాబు ఘటనా స్థలానికి చేరుకొని విచారణ చేపట్టారు. మహబూబ్‌నగర్ నుంచి క్లూస్‌టీంను రప్పించి సామాన్లు, బీరువాలపై ఉన్న వేలిముద్రలను పరిశీలించారు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వెల్లడించారు.

# రోడ్డు ప్రమాదంలో యువకుల దుర్మరణం

- గుర్తు తెలియని వాహనం ఢీకొని ఒకరు.. కాపాడబోయి మరొకరు..



సయ్యద్ నవాజ్, అశోక్(ఫైల్)

కల్వకుర్తి రూరల్/కొత్తకోట, డిసెంబర్ 22 : అత్తగారింటికి వెళ్లి బైక్‌పై తిరిగి వస్తుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో కల్వకుర్తి పట్టణానికి చెంది న యువకుడు ప్రాణాపాయంతో కొట్టుమిట్టాడుతుండగా అతడిని కాపాడేందుకు వెళ్లిన కొత్తకోటకు చెందిన మరో యువకుడిని గుర్తు తెలియని వాహ నం ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందిన ఘటన గురువారం రాత్రి కల్వకుర్తిలో చోటు చేసుకున్నది. కల్వకుర్తి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కల్వకుర్తి పట్టణానికి చెందిన సయ్యద్ నవాజ్(25) దంపతులకు ఇటీవల పాప జన్మించింది. పాప డోలారోహణకు బట్టలు ఇచ్చి జడ్చర్ల నుంచి గురువారం రాత్రి కల్వకుర్తికి బైక్‌పై బయలుదేరాడు. ఈ క్రమంలో మార్చాల గ్రామం దాటి న తర్వాత గుర్తు తెలియని వాహనం సయ్యద్‌నవాజ్ బైక్‌ను ఢీకొట్టడంతో ప్రాణాపాయస్థితిలో కొట్టుమిట్టాడుతున్నాడు. దీనిని గమనించి బొలెరో వాహనంలో ఉన్న అశోక్, డ్రైవర్ నర్సింహ వాహనం దిగి అతడివద్దకు రాగా అశోక్(30) ను గుర్తు తెలియని వాహనం వేగంగా వచ్చి ఢీకొట్టడంతో అశోక్‌తోపాటు నవాజ్ అక్కడికక్కడే మృతి చెందారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం కల్వకుర్తి ప్రభుత్వ దవాఖానకు తరలించారు. బొలెరో వాహనం డ్రైవర్ నర్సింహ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తునట్లు ఎస్సై వెల్లడించారు. సయ్యద్ నవాజ్ మరో ఐదు నిమిషాలైతే ఇంటికి చేరేవాడని కుటుంబ సభ్యులు రోదించగా ఆపదలో ఉన్న వ్యక్తిని కాపాడబోయిన అశోక్ అనంతలోకాలకు వెళ్లడంపై పలువురు తీవ్ర విచారం వ్యక్తం చేశారు. అయితే కనిమెట్టకి చెందిన అశోక్ పాల ఫ్యాక్టరీలో వ్యాన్ క్లీనర్‌గా పని చేస్తున్నాడు. కల్వకుర్తిలో పాలడబ్బాలను దించేందుకు వెళ్లి మృతి చెందాడు.

- ప్రతిఒక్కరూ ధ్యాన సాధన చేయాలి
- పరిమళపత్రీ, పరిణితీపత్రీ

# ధ్యాన జగత్ నిర్మాణమే లక్ష్యం



ధ్యాన మహాసభలో మాట్లాడుతున్న స్వర్ణమాలపత్రీ



పిరమిడ్ ఆవరణలో ధ్యానం చేస్తున్న యువతులు

కడ్తాల్, డిసెంబర్ 22 : విశ్వమంతా ధ్యానం అందించడమే పిరమిడ్ ట్రస్ట్ లక్ష్యమని, ధ్యాన గురువు సుభాష్ పత్రీజీ ఆశయాలకు అనుగుణంగా ప్రతి ధ్యాని పనిచేయాలని పత్రీజీ కుమార్తెలు పరిమళ పత్రీ, పరిణితీ పత్రీ అన్నారు. కడ్తాల్ సమీపంలోని మహేశ్వర మహా పిరమిడ్‌లో జరుగుతున్న పత్రీజీ ధ్యాన మహాయాగం–2 శుక్రవారం రెండోరోజుకు చేరుకుంది. ఉదయం 5నుంచి 8 గంటల వరకు నిర్వహించిన ప్రాతఃకాల సంగీత ధ్యానంలో పలు ప్రాంతాల నుంచి వచ్చిన ధ్యానులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ధ్యానులనుద్దేశించి పరిమళ పత్రీ, పరిణితీ ప్రతీ మాట్లాడుతూ ధ్యాన జగత్ నిర్మాణమే లక్ష్యంగా పిరమిడ్ సొసైటీ మూవ్‌మెంట్ చేస్తున్నదని తెలిపారు. కర్నూల్ జిల్లాలో చిన్న సొసైటీగా ప్రారంభమై నేడు గ్లోబల్ పీఎస్ఎస్ఎంగా అవతరించిందని పేర్కొన్నారు. కులమతాలకు అతీతంగా ప్రతిఒక్కరూ ధ్యానం నేర్చుకొని ఆచరించాలన్నారు. పిరమిడ్ ట్రస్ట్ చైర్మన్ విజయభాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ నిత్య ధ్యాన సాధనతో మనిషిలో ఏకాగ్రత పెంపొందుతుందని తెలిపారు. ఆనందమయ జీవితానికి, సంపూర్ణ ఆరోగ్యం కోసం నిత్యం ధ్యానం చేయాలని సూచించారు. అనంతరం ధ్యాన మహాయాగంలో సుభాష్‌పత్రీజీ సందేశాలను వీడియో రూపంలో ప్రదర్శించారు. కార్యక్రమంలో రాంబాబు, శ్రీరాంగోపాల్, సాంబశివరావు, హనుమంతు రాజు, బాలకృష్ణ, దామోదర్‌రెడ్డి, నవకాంత్, ఆనంద్, మాధవి, లక్ష్మి, జయశ్రీ తదితరులు పాల్గొన్నారు.